హేమలతకు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 5: ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగంలో టి. హేమలత డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ శుభాడ వంజపె పర్యవేక్షణలో ' హిందీ – తెలుగు కావ్య మే శ్రీమద్ భాగవత్ : ఏక్ అనుశీలన్' అనే అంశంపై పరిశోధన పూర్తిచేశారు. హేమలత సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్స్ బ్రాంచి అధికారులు ఆమెకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమె ప్రస్తుతం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అంగడి రాయ్‌చూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

ఎంపీఈడీ పరీక్ష ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ రెగ్యూలర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

చదువులతో పాటు క్రీడలూ ముఖ్యమే

విద్యార్థులు చదువులతో పాటు క్రీడలకూ సమ ప్రాధాన్యత నివ్వాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం అమీర్‌పేట్ జీహెచ్ఎంసీ మైదానంలో బీఆర్ఎస్ నాయకులు సచిన్ రాథోడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న తలసాని శంకర్‌యాదవ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే తలసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొంత సమయం బ్యాటింగ్ చేసిన తలసాని విద్యార్థులను హుషారెత్తించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎం.హనుమంతరావు, నాయకులు అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ, కట్టా బలరామ్, వపం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- అమీర్‌పేట్

ఎవరికి ఆపద వచ్చినా.. అందుబాటులో ఉంటా

బేగంపేట్ ఆగస్టు 5 : ఎవ్వరికి ఏ అవసరం వచ్చిన తాను ఎల్లవేళల అందుబాటులో ఉంటానని ఇది సనత్‌నగర్ నియోజకవర్గం ప్రజలందరికి తెలుసునని మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని 80 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 80 మంది లబ్ధిదారులకు గానూ రూ.28.86 లక్షల విలువైన చెక్కులు అందించినట్టు తెలిపారు. అదే విధంగా బాలనగర్ మండల పరిధిలోని సనత్‌నగర్ డివిజన్‌కు సంబంధించిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను కూడా లబ్ధిదారులకు ఈ సందర్భంగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ... ఆడ పడుచుల పెండ్లికి పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఒక లక్ష నూట పదహార్లు ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో ఈ పథకాలను ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేగాకుండా ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సైతం సహాయం మంజూరు చేయిస్తున్న విషయాన్ని కూడా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి బీఆర్ఎస్ నాయకులు హరికృష్ణ, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, వెంకటేషన్‌రాజు, హన్మంతరావు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఫలహారపు బండ్ల ఊరేగింపు

మేడిబావి, పోచమ్మ ఆలయంలో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఫలహారపు బండ్ల ఊరేగింపు కనుల పండువగా సాగాయి. పోతురాజుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సీతాఫల్‌మండి పరిధిలోని పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ ట్రస్టీ పరికిబండ కళాప్రకాశ్ పజ్జన్నను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా చిలకలగూడలో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపును ఎమ్మెల్యే ప్రారంభించారు.

- సికింద్రాబాద్

బాలంరాయిలో ముగిసిన ఉత్సవాలు

మారేడ్‌పల్లి, ఆగస్టు 5: కంటోన్మెంట్ మూడో వార్డు బాలంరాయి, అంబేద్కర్‌నగర్, అంబేద్కర్‌నగర్ సొసైటీ బస్తీల్లో బోనాల ఉత్సవాలు సోమవారం ముగిశాయి. పోతురాజుల విన్యాసాలు, ఫలహారపు బండ్ల ఊరేగింపు నడుమ అమ్మవారి బోనాల ఉత్సవాలు జరిగాయి. బాలంరాయిలోని దండు మారెమ్మ ఆలయంలో రంగం, భవిష్యవాణి కార్యక్రమం జరిగింది. సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో భవిష్యవాణి వినిపించే స్వర్ణలత ఇక్కడి ఆలయంలోనూ భవిష్యవాణి వినిపించడం అనవాయితీ. జాతర నిర్వహించిన తీరు, తనకు నిర్వహించిన పూజల పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. శ్రావణంలో ప్రతి శుక్రవారం ఆలయంలో దీపాలు వెలిగించాలని కోరింది. నిరుద్యోగులకు దశలవారీగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని భవిష్యవాణి వినిపించారు. పలు ఫలహారం బండ్ల ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొన్నారు.



మేడిబావి, పోచమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం



స్వచ్ఛదనం – పచ్చదనం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం అడ్డగుట్టలో స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మిశ్రీనివాస్, జీహెచ్ఎమ్‌సీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని ఆమె గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లింగాని శ్రీనివాస్, పెండెం మనోహర్, సత్తయ్యగౌడ్, మహ్మద్, అమర్ బాన్సోడే, ఎల్లయ్య, రామప్ప చారి, దేవయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పారిశుధ్య నిర్వాహణపై సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీతరమేశ్ అన్నారు. సోమవారం మెట్టుగూడలో నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహనను కల్పించారు. ప్రజలు సామాజిక బాధ్యతగా స్వచ్ఛదనం, పచ్చదనంపై దృష్టిసారించాలని ఆమె సూచించారు.

- అడ్డగుట్ట

ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం

సికింద్రాబాద్, ఆగస్టు 5: సీతాఫల్‌మండి డివిజన్‌లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ హేమ అన్నారు. సోమవారం అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని మహ్మద్‌గూడలో కార్పొరేటర్ పర్యటించారు. స్థానికులు సమస్యలు ఉన్నాయని తెలిపారు. దీంతో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్‌తో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే రెడ్‌క్రాస్ ఆసుపత్రి పక్కన ఉన్న పార్క్‌ను పరిశీలించారు. పార్క్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని త్వరలోనే వాకర్స్‌కు, పిల్లలకు అనుకూలంగా ఉండేలా తీర్చిదిద్దుతామని హామీఇచ్చారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఇన్‌చార్జి మేనేజర్ వరుణ్ పాల్గొన్నారు.

మహ్మద్‌గూడలో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

టీచర్స్‌కాలనీ పార్కులో మొక్క నాటుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

సింధికాలనీలో మొక్క నాటుతున్న బేగంపేట్ డీసీ సమ్మయ్య, కార్పొరేటర్ సుచిత్ర

మారేడ్‌పల్లి, ఆగస్టు 5: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు మొక్కలు నాటి, సంరక్షించుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సోమవారం మోండా డివిజన్ టీచర్స్‌కాలనీ పార్కులో నిర్వహించిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్కు ఆవరణలో కార్పొరేటర్ కొంతం దీపిక, బేగంపేట డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొక్కలను నాటడంతో పాటు ఎదిగే వరకు వాటి సంరక్షణకు భాగస్వాములు కావాలన్నారు. బస్తీ, కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. దోమల నియంత్రణకు, చెరువుల సంరక్షణకు, నాలాల క్లీనింగ్, వన మహోత్సవం లాంటి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సి.సంతోష్‌యాదవ్, ఆర్డీ నాగేశ్‌యాదవ్, సి.బద్రినాథ్ యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు, రౌతు రాజయ్య, సదానంద్‌గౌడ్, బాబయ్యయాదవ్, సాయిప్రకాశ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

సికింద్రాబాద్ : పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా గుర్తించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని కార్పొరేటర్ హేమ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా మైలార్‌గడ్డ, చిలకలగూడ బడి మసీదు, మహ్మద్‌గూడ, కింది బస్తీ, అన్నానగర్‌లో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలలు, వైద్యశాలల ఆవరణలో విధిగా పారిశుధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి సంధ్య, యూసీడీ సీఓ అధికారి ధనుశ్రీ, జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బేగంపేట్ : పర్యావరణాన్ని కాపాడటంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర సూచించారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బేగంపేట్ సర్కిల్ పరిధిలోని రాంగోపాల్‌పేట్ డివిజన్ సింధికాలనీ, డీవీకాలనీ, కృష్ణనగర్ కాలనీల్లో బేగంపేట్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ సమ్మయ్య, కార్పొరేటర్ చీర సుచిత్ర మొక్కలు నాటారు. కార్పొరేటర్ సుచిత్ర, సర్కిల్ డీసీ సమ్మయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడాలని సూచించారు. మొక్కల పరిరక్షణకు కృషి చేయాలని వారు కోరారు. కాలనీవాసులకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, ఎంటమాలజి సిబ్బంది, కాలనీవాసులు, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో స్వచ్ఛదనం, పచ్చదనం

ఉస్మానియా యూనివర్సిటీ : ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని బౌద్ధనగర్ డివిజన్‌లో సోమవారం ప్రారంభించారు. వార్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమ ప్రారంభోత్సవానికి కార్పొరేటర్ కంది శైలజ, జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఏఎంసీ ఒమర్, డాక్టర్ ఎలిజబెత్ హాజరయ్యారు. కార్పొరేటర్ శైలజ మాట్లాడుతూ.. కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రజలకు మొక్కలు పంపిణీ చేస్తున్న బౌద్ధనగర్ కార్పొరేటర్ శైలజ

చిలకలగూడలో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ హేమ

నేరాలను అరికట్టేందుకు చర్యలు

బొల్లారం, ఆగస్టు 5: బోయిన్‌పల్లి మార్కెట్‌లో నేరాలను అరికట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని తిరుమలగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. సోమవారం మార్కెట్‌లోని హమాలీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో దొంగతనాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు యాక్సెస్ నియంత్రణతో అవసరమైన నూతన సీసీ టీవీలను ఏర్పాటు చేసి నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌లో హమాలీ కార్మికులతో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

ఆలయాల వద్ద పారిశుధ్య పనులు షురూ..

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 5 : డివిజన్‌లో 11, 12తేదీల్లో జరుగనున్న బోనాల సందర్భంగా ఆలయాల పరిసరాల్లో పారిశుధ్యం నెలకొల్పాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. రంగంలోకి దిగిన బల్దియా సిబ్బంది బోయిగూడ, భోలక్‌పూర్, ఐడీహెచ్ కాలనీల్లోని ఆలయాల వద్ద పనులను మొదలుపెట్టారు. సోమవారం బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, నాయకులు శివకుమార్, ఎన్.మల్లేశ్, కల్యాణ్ రామ్, కళారంగ్‌కాలనీ అధ్యక్షుడు జావేద్, బాలకృష్ణ, కళావతి, విజయ్, ఉమరుద్దీన్‌తో కలిసి నల్లపోచమ్మ ఆలయం పరిసరాలల్లో పనులను పరిశీలించారు.

బోయిగూడలోని ఆలయాల వద్ద పారిశుధ్య పనులు చేపట్టిన జీహెచ్ఎంసీ సిబ్బంది

ఓల్డ్ మడ్‌పోర్టు బస్తీలో బోర్డు నామినేటెడ్ సభ్యుడి పర్యటన

బస్తీలో స్థానికులతో మాట్లాడుతున్న బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

మారేడ్‌పల్లి, ఆగస్టు 5: కంటోన్మెంట్ మూడోవార్డు ఓల్డ్ మడ్‌పోర్టు బస్తీలో సోమవారం బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ పర్యటించారు. బస్తీబాటలో భాగంగా స్థానిక సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. బస్తీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రామకృష్ణ మాట్లాడుతూ.. స్థానిక సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బస్తీలో నెలకొన్న సమస్యలన్నీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీఎన్ శ్రీనివాస్, అరుణ్, రాజ మల్లేశ్, శంకర్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానను సందర్శించిన డీఎంహెచ్ఓ

చాచానెహ్రూనగర్ బస్తీ దవాఖానను సందర్శించిన డీఎంహెచ్ఓ వెంకటి

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 5: పరిసరాల శుభ్రత పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జె.వెంకటి అన్నారు. సోమవారం ఆయన లాలాపేట్ క్లస్టర్ ఎస్పీహెచ్ఓ డాక్టర్ జయశ్రీతో కలిసి చాచానెహ్రూ నగర్‌లోని బస్తీ దవాఖానను సందర్శించారు. రోజువారి సందర్శకుల నమోదు, నమోదైన డెంగీ కేసులు, నివారణ చర్యలు, దవాఖానలోని ఫార్మసీలో ఉన్న మందుల వివరాలను పరిశీలించారు. పరిసర బస్తీల్లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాగస్వామ్యం కావాలని, తద్వారా ప్రజలను చైతన్యం చేయాల్సిందిగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్‌కు సూచించారు. ప్రమాదకరమైన సీజనల్ వ్యాధులను ఎదుర్కోవడానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉన్నదని ఆయన తెలిపారు. ఉచితంగా వైద్యుల సలహాలు, టెలిమెడిసిన్ సేవలు, అవసరమైన పరీక్షలు బస్తీ దవాఖానల ద్వారా ప్రజలు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.